# చదువు 'కొంటా' ఉండారు!

''నెత్తిన నోరు పెట్టుకోని మొత్తుకుంటే ఆపొద్దు చెవల్లో పడకుండా పాయ. ఈ పొద్దు యిట్టా గొంతు చించుకుంటే ఏం లాబం? అదును పొదును పాయ్‌నాక నా మొగుడు రాయి సేద్దిగాడన్నెట్టుండా యాపాడం. అందుకనే-

కొంపలో ఆడదో గాడిదో వాగిటుండాది. అదీ వొక మణిసే. దానికీ ఒక తలకాయ ఉండాది. ఆ తలకాయలో మట్టో మశాణవో తలకాయ అన్నాక ఉండనే ఉంటింది. ఇందాం. ఇష్టం ఉంటే తీసుకుందాం. లేకుంటే యిసిరవతల పారేద్దాం. దానివల్ల వచ్చిన నష్టం ఏముండాది? అని ఈ మొగోళ్లకు రోంతన్నా బుద్ధుంటే కొంపల్లో ఈ కుమ్ములాటలుండవు. కుమిలి కుమిలి చచ్చే పనీ ఉండదు. 'తెచ్చేస్తే తినేసి తీరుబాటుగా కూసునే ఆడవి. అవ్వి చెప్పేదేంది? మేము యినేదేంది?' అంటా ఎగబడి ఎగబడి వచ్చే మొగోళ్లు మల్లా తగలాల్సిన చోట్లో తగిలేకుందికి తలకాయ పట్టుకోని కూసుంటారు.''

సందు దొరికిందంటే చాలు. ఒక్క మోపన వాయించేదంటే మా బాశాలికి బలే కుశాల. ఆపొద్దు గుక్క యిడవకుండా మోటుకుంటే-

''ఏందే నీ వాగిరింపు?'' అంటి.

''ఆ! ఆ! వాగిసి వాగిసి యింక నేను వారుకో పోతాఉండా.''

''మాటకు మాట తెగులు. నీటికి పాచి తెగులే!''

''నేను ఏడ్సేదిగూడా అదేగదా?''

''కడవ పెట్టమంటావా? కాపీ గళాసే చాలా?''

''ఏమిటికి?''

''ఆహా! యాడస్తా నంటావుంటే!''

''హుఁ! నీయట్టా మొగోళ్లు యింక అంతకంటే ఏం చెయ్యగల్తార్లే?''

''ఒసే! పిచ్చిదానా. మహన్నబావుడెవుడో చెప్పినాడంట్నే. కలకంటి కంట కన్నీరొలికిన సిరి యింట ఉండదంట్నే! అందుకుగదా నా బాద.''

''ఆ! యిప్పుడు వాసాలకంగా ఉండాది. ఈ దరిద్రపు మొకంది ఏడిస్తే చూళ్లేకుండా పారిపోతింది. అప్పుడు ఈ మొగోడు యూరుడు శూరుడై...''

''సిరి దాకా ఎందుకే? మన యవ్వారం చూళ్లేకుండా మన పిలకాయలే ఉచ్చులు తెంపుకోని పరిగిత్తావుంటే!... ఈ కొంప రతికెక్క పొయ్యేది లే!... ఈ జల్మాలు...''

''ఇద్దో యిట్టమ్మా! రాదీసి రాళ్లెయ్యమంటే ఈ యిలాకాలో నా మొగుడు మొగలాయమ్మా. ఎవురి బిడ్డయితే ఏముండాది మిరపకాయల కుండలో దాసి పెట్టుకోవచ్చు.''

''మిరపకాయల కుండ్లోనా!... గోయిందో! గోయింద!''

''మిరపకాయల కుండన్నావే గానీ నా బంగారి మొగడా! ఆడ ఉండే బద్రం యింక యాడుంటిందే?... పురుగూ బూసి సోకితిందా? సెదులు గిదులు పట్టితిందా? అయినా యింక నిన్ను యాడ పెట్టుకోని మాత్రం ఏం కాపాడుకో బోతాన్లే? అంతా నా బ్రెమ కానీ...''

''వొసే! వొసే! నా వయ్యారిబామా! నువ్వు గాదే ఈ చరాచర ప్రెపంచమే బ్రెమలో పడి కొట్టుకోని పోతా ఉండాదే?''

''కొట్టుకోని పోతావుంటే పోనీలే. నలగర్రికైన పాడేగదా మనగ్గూడా? ఏమో కొంపలే కొట్టకపోతా ఉణ్ణెట్టుగా యియ్యరవదాకా ఆ బిడ్డ మింద యిర్సక పడ్తివే? పోనీ! ఆ బిడ్డ పోన్లో యింగ్లిపీసులో మాట్లాడేసుంటే కొట్టుకోని పోతావుండేది నిలబడి పొయ్యుణ్ణా?''

''ఇద్దో యిట్టా! తలకేస్తే మొలకు. మొలకేస్తే తలకు. ఎట్నే నీతో ఏగులాడేది? నాలుగచ్చిరాలు నేర్చుకోని కొంపదీసి నువ్వుగాన ఒక వకీలై నల్లకోటు తొడుక్కోనుంటే కొంపలు నిలవనా కూలి పొయ్యుండు. జడ్జీలు చెరువుకు శారదు నీళ్లు తాగుందురు. నా కత ఎట్టన్నా అంగలార్చి పోనీ...''

''నీ కతకు ఏమయిందయ్యా?''

''నా కత కేమే? పొద్దుగూకులు కుండను గోకినట్లు గోకతా పెండ్లాము... పొట్ట పొడిస్తే అచ్చిరాలు రాని పిలకాయిలూ...''

''ఆపొద్దు నేను నెత్తిననోరు పెట్టుకోని మొత్తుకుణ్ణా చెవల్లో పళ్లేదే? అని ఒక్క మాట అనిందానికి యింత రామాయిణం సదగాల్నా? రామ! రామ!''

''రామాయిణం సీరియల్ ఈ టీవీల్లో రానన్నా వచ్చిందిగానీ నా సామి రంగా! అందురు హనుమంతుడి మాదిర్తో రామా! రామా! అని కలవరించి పోతా ఉండారే? పోనీ! నాది రామాయిణమే. నీది బాగోతమా? ఆ పొద్దు నువ్వు నెత్తిన నోరు పెట్టుకోని మొత్తుకుణ్ణింది ఏందో చెప్పకుండా యిట్టా సతాయిస్తా కూసుంటే ఇంక నేను యాడ పాయ్ చావాల్నే?''

''మగరాయుడివి నువ్వెందుకే చచ్చేది. నువ్వు చస్తే నేను కొంపలోబడి నాచావు నేను చావాల. అదే నేను చస్తే వారం అట్టా తిరిగీ తిరగక ముందే నువ్వు ఇంకొక దాన్ని

తెచ్చుకోని కులకచ్చు). ఆ చచ్చేదేదో నా చావు నేనే చస్తే పొసుపు కుంకంతో పొయ్యిందని పేరైనా ఉంటింది.''

''నిద్దర లేస్తే ఇంక మనకు ఏముండాదే? నువ్వు చావు. నేను చావు. అట్ట చచ్చినట్టు కాకపాయ. బతికినట్టు కాక పాయ. ఇంతకూ యవ్వారం ఇంత దూరం రావాల్సిన అవసరం ఎందుకొచ్చింది? ఒక బిడ్డ ఎమ్మే. ఇంకొక బిడ్డ బియ్యే. ఎత్తుకోని పాయ్ ఏ యేట్లో ఏసేదానికి? పోన్లో ఎవుడో ఇంగిలీసులో మాట్లాడితే ఎవురు మాట్లాడింది? ఏం మాట్లాడిందీ? చెప్పలేకుండా పోతే ఇంక ఎందుకే ఈ చదువులు... చట్టుబండలు?''

''ఈ ఎరవదాకా నేను ఏడ్సింది కూడా అదే గదా? ఆ పొద్దు నెత్తిన నోరు పెట్టుకోని మొత్తుకుణ్ణిందీ అదే గదా? కడగోటు పిలకాయిలే. ఆ ఇద్దర్నీ అయినా కాన్వెంట్లో చేర్పించే. ఇక్కన పక్కన ఇంతింత పిలకాయిలు ఇంగిలీసులో మాట్లాడతా ఉంటే పండ్లట్టానే పులిసి పోతా ఉండాయి. బాదల్లో అదొక బాద. పడతా లేస్తా ఉంటే జరిగేది జరగతా ఉంటిందే. ఇల్లే వైకుంటం. కడుపే కైలాసం. ఒక గుడీలే. ఒక గోపరమూ లే. లేకపోతే పొయ్యింది. ఈ మునాస అయినా తీర్సరాదా. అంటే నువ్వేమన్నా మునపడ్తివా? లేదే. ఇప్పుడు పొట్ట పొడిస్తే అచ్చిరందాని పిలకాయిలని యిర్సక పణ్ణా లాబంలే. ఇశార పణ్ణా లాబం లే.''

''అయితే నీ మాటకే వస్తా వుండా. కాన్వెంట్లల్లో చదువుకుండే పిలకాయిలేనా ఇంగ్లీషులో మాట్లాడతా ఉండేది.''

పిలకాయిల్ను కాన్వెంట్లో చేర్పించకుండా పొయ్యిందాని వల్లే వాళ్లకు ఇంగ్లీషు చదువు అంటకుండా పొయ్యిందని మా బాశాలి మణుసులో బాగా నాటుకోని పొయ్యుండాది. ఆపె కత తెలిసిందే. పట్టిడుపులు రొండూ ఎరగని ఎర్రి బాగర్లి. ఇంక పట్టుకుణ్ణె కుందేలికి మూడే కాళ్లంటింది. ఇల్లు ఇరకాటం. ఆలు మర్కటం కతగా ఉంటే తెగేదాకా లాగేది మంచిది కాదనుకుణ్ణా. ఆపెపాటికి ఆపేందో సొణుక్కుంటా ఉంటే నా పాటికి నేను ఎలబార్నా.

ఎగబడి ఆ నాలుగ్గాళ్లమండపం కాడ పోతా ఉండా. చిన్న చిన్న పిలకాయిలు కార్లు స్కూటర్లు సైకిళ్ల మింద దొర బిడ్డల మాదిర కూసోని పోతా ఉండారు. వాళ్లను చూస్తా ఉంటే బాగా కాపుకొచ్చిన సన్నటి కొమ్మ ఆ బొరువుకు తట్టుకోలేక వంగి పాయ్ నట్టుండాది.

ఈళ్లంతా కాన్వెంట్లల్లో చదువుకుండే పిలకాయిలు!

ఈళ్లు ఇంగ్లీషు మాట్లాడతారు. అబ్బా అమ్మను మమ్మీ డాడీ అని పిలుస్తారు. ఎదురు పణ్ణె ఏ యెదవనైనా అంకుల్ అని పిలిచేస్తారు. తెలుగు పుస్తకాన్ని పుల్లాకు మాదిర్తో చూస్తారు. తప్పే దారి చదవమంటే ఏడుపు మొకం పెట్టేసి ఇంగ్లీషు యాసతో తెలుగును కూడి కూడి చదవతారు. ఇటుమంటి పిలకాయిల్ను మా బాశాలి మాదిరి మణుసులు చూసినారంటే- వాళ్ల ఆనందమే ఆనందం. పాపం వాళ్లొక ఎర్రి బాగల మణుసులు. తమ పిలకాయిలుగూడా కాన్వెంటు చదువులు చదవలేదని కుంగి పోతారు.

''మనది తెలుగు దేశం. మనది తెలుగు బాస. మన ముక్కెమంత్రి తెలుగోడు. ఆయన నిద్దర్లో గూడా తెలుగు తెలుగని కలవరిస్తా ఉంటాడు. తూపాను గిపానొచ్చి కొంపా

గోడు కొట్టుకోని పోతే ప్రజలు అల్లాకుపల్లాకులై చెట్టు చేమల కింద నిలబడితే 'తెలుగు నీడ సుకీబవ!' అంటాడు. కరెంటు లేకుండా చీగిట్లో చిగులుకోని అల్లాడతా ఉంటే 'తెలుగు వెలుగు సుకీబవ!' అంటాడు. కల్లో ఎవ్వురైనా ఒక ఆడ పడుచు 'అన్నా!' అని పిల్సినట్టుంటే! 'తెలుగు మహిళ సుకీబవ!' అంటాడు. అట్టాంటి ముక్కెమంత్రి కలగని మేలుకోని 'తెలుగు బాల సుకీబవ!' అన్నాడు. ఇంకేముండాది. ఈదికి ఇరవై కాన్వెంట్లు. దిగులు పడాల్సిన పనేలే. తెలుగు బాలలు సుకపడిపోతారు.'' అని అనుకుంటా అట్టా చూసే కుందికి ఎదురుంగా వెంకట రెడ్డి.

''ఏం రా! అబ్బోడా! ఉరుము మెరుపు లేకుండానే ఊడి పణ్ణావే?'' అంటే-

''పిలగాణ్ణి కాన్వెంటులో చేర్పించాల గదన్నా'' అంటా చంకలో పిలగాణ్ణి చూపించె.

''నీ కెట్టా పుట్టిందిరా ఈ బుద్ధి? నిజ్జింగా నువ్వేనా మాట్లాడతా ఉండేది?''

''అదేందన్నా అట్టంటా ఉండావే?''

''అదిగాదురా ఏడో తరగతి దాకా చదువుకుంటివి గదా? ఇప్పుడా? నలబై ఏండ్ల కిందట్నే. ఆ ఎనిమిదట్టా బటువైందని అనిపించు కుంటే చాలు. టీచర్ ట్రైనింగ్ కన్నా పోవచ్చు గదరా? అంటే వొంగినోడి కింద వొంగే యాపాడం వద్దంటివే. మల్లా ఈ పొద్దు పుట్లో మూడాకులెయ్‌ని ఈ పిలగాణ్ణి చంకలో ఏసుకోని వచ్చినావే?''

''అన్నా! చెప్పిందే మల్లీ మల్లీ చెప్తా ఉంటే పాడిందే పాడ్రా పంగానామాల దాసిరీ! అన్నెట్టుగా ఉంటింది. అయినా తప్పేటిగా లేదు. అంతో యింతో కయ్యా గాలవ బగమంతుడిచ్చిన కాడికి ఉండాది గదా. వొళ్లో చేతులు పెట్టుకోకుండా వొళ్లొంచి కష్టపడ్తే వొకడికంత పెట్టి మనవంత తినచ్చు- అనే మణుసుండాది. ఉంటే యేంచేసేది? ఇప్పటి పల్లెల కత చూస్తావుండావ్ గదన్నా. తాగేదానికే నీళ్ల లేకుండా తనకలాడి పోతా వుంటే యింక సేద్దానికి నీళ్లు? నీకు తెల్సి మన ఆడోళ్లు కడవలు చంక నేసుకోని కంబాల చేనికి తాగేనీళ్లకు పొయ్యింది ఎప్పుడైనా చూసినావా? పోనీ యిన్నావా? ఇంకా పల్లెకొంపల్లో బతికి బట్టగట్ట పొయ్యేది లేదన్నా. కూతురు బిడ్డగాదు. కొడుకు బిడ్డ. ఈణ్ణైనా అట్టా చదివిస్తే వాడన్నా బాగు పడ్తాడు. మనం ఎట్టా అట్టా యిట్టా కూడా కాకుండా పోతిమి.''

''అయిదో తరగతి దాకా చదువుకుండే దానికి మనం దినమ్ము కొంక నక్కల పెంటకు రొండు రొండు నాలుగుమైళ్లు నడిస్తిమి. ఆరో తరగతికి పెనుమూరికి నాలుగు నాలుగు ఎనిమిది మైళ్లు నడిస్తిమి. ఇప్పుడు అట్టా నడవాల్సిన పన్లేదు గదా? చెట్టుకిందైనా ఊరికొక ఇస్కూలుండ్లా?''

''ఉండ్లా మరి? ఆడ చదివేస్తే ఉండే మతి పోయేటట్టుగా ఉండాదే?''

''మనమంతా చదువుకుణ్ణింది ఆణ్ణేగదరా?''

''ఆ కాలానికి ఈ కాలానికి సాటి పెట్టేదానికి ఎట్టవితిందిలేన్నా? అప్పుడు అయ్యోర్లు చదువు చెప్పాలని చెప్తా ఉండ్రి. మనం చదువుకోవాలని చదువుకుంటిమి. డిక్టేషన్ చెప్తే ఒక్క తప్పుపోతే తప్పుకు పది గుంజిళ్లు గదన్నా? ఎక్కాలడిగితే యాడడిగితే ఆడ

తడుముకోకుండా తటిక్మని చెప్పకుండాబోతే తలబుడపగడ్తా ఉణ్ణే! ఒక్క పూట గొడ్డు గోదా కాడికి పాయ్ స్కూలికి నాం పెడ్తే ఆ దినమంతా ఒంటి కాలి మింద నిలబడాల్సిందే గదన్నా. పోనీ! పిలగాడు ఇంత కష్టపడి చదువుకుండా ఉండాడని ఇంట్లో వాళ్లేమన్నా ఊరికే ఇడిసిపెట్టా ఉంద్రా. గొడ్డును కాడికి కట్టి ఎనక్కూ ముందిరికీ ఈడ్సినట్టు ఈడస్తా ఉంద్రే. కోడిగూసే యాళకాడ యెద్దల తోలుకోని పోతా ఉంటిమా? అయ్యో అన్నో! మోట తోల్తా ఉంటే పారెత్తుకోని ఆకుతోటకో చెరుకు తోటకో నీళ్ల కడతా ఉంటిమా? అంత కష్టపడి చదువుకుంటే గూడా 'ఆ! ఈడు సదిగి సదిగి కలేక్టరు ఉద్దోగం చేసి ఉద్దరించబోతాడు.' అంటా యాసణ్ణం పడ్తా ఉంద్రి. అదొక ఎర్రి కాలం. ఇప్పుడా? 'ఒరే అబ్బోడా! దాన్నట్టా అందుకోరా!' అంటే 'లేచి ఎత్తుకోరాదా?' అంటారు.''

''అది సరేరా. కాన్వెంటు చదువులంటే అవ్వి కలిగినోళ్లకే గదరా? ఆ డొనేషన్లు... ఆ పుస్తకాలు... ఆ డ్రెస్సులు... మన వల్ల అయ్యే పనేనంటావా?''

''అట్టనుకుంటే ఎట్టన్నా? దేనికన్నా పెట్టుబడి పెట్టన్ది అది యాపారం అవితిందా?''

''యాపారమా?''

''అంతే గదన్నా సేద్దానికైనా పెట్టుబడి పెట్టాల్సిందే. యాపారినికైనా పెట్టుబడి పెట్టాల్సిందే. అట్టా మాదిరే ఈ కాన్వెంటు చదువులు గూడా. అన్నా! అంతో యింతో పెట్టుబడి పెట్టి సేద్దెం చేస్తాం. రావాల్సినంత పంట చేతికి రావచ్చు. రాకపోవచ్చు. యాపారం చేస్తాం. అది శాతగాని యాపారమైతే నష్ట పడి పోవచ్చు. కానీ కాన్వెంటు చదువుల మింద పెట్నె పెట్టుబళ్లకు డోకా లేదన్నా!''

''అదెట్రా?'' అంటా వాడికల్లా నోరు తెర్సుకోని చూస్తా ఉండా.

''కాకుండాపోతే ఇంకేంది రా? వెంకట రెడ్డిని ఏమో అనుకుంటా ఉంటే మొగలాయి మాట చెప్పెనే. అప్పుడు మనం చదువుకుంటా ఉంటిమి. ఇప్పుడు చదువు 'కొంటా' ఉండారు. కొనాలంటే పెట్టుబడి పెట్టాల్నా వద్దా నువ్వే చెప్పు. మన వెంకట రెడ్డినే తీస్కో. ఈ పిలగాడి మింద ఇప్పటినుంచీ ఎట్నో ఒకట్టా కష్ట పడి పెట్టుబడి పెడ్తానే ఉంటాడు. ఒకలచ్చా రొండు లచ్చలో అవితిందనుకో. రేపు ఈ పిలగాడు ఒక డాక్టరో ఇంజనీరో అవతాడు. అప్పుడు మార్కెట్లో వాడి రేటెంత? కనా కష్టంగా అయిదారు లచ్చలన్నా పలికితింది. అంత కంత లాబం సాల్దా?''

కాన్వెంటు చదువుల్లో ముడి యిప్పేసి ముత్తారెడ్డన్న ముసి ముసి గా నవ్వతా ఉండాడు. మాయమ్మ ఎర్రగెడ్డల యాపారం చేసె. తమలపాకుల యాపారం చేసె. చింతపొండు యాపారం చేసె. బెల్లం యాపారం చేసె. ఎన్ని యాపారాలు చేసినా యీడికి అందని ఆడికి చాలని బతుకే బతికె! – నన్ను అడ్డం పెట్టుకోని యిట్టా మాదిర యాపారం చేసుంటే? –

అయ్యింది పొయ్యింది అలిమేలమ్మ. కొంగు జాడించింది గోయిందమ్మ! అన్నెట్టు ఇప్పుడు ఎన్ననుకుంటే మాత్రం ఏమి లాబం? ●.